అయోధ్య రామయ్య అక్షింతల ఊరేగింపు

పామిడి: కట్టకిందపల్లి గ్రామంలో ఆదివారం అయోధ్య రామయ్య అక్షింతలను ఊరేగించారు. ఈసందర్భంగా శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ పామిడి ఖండ ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులు, పెద్దలు కలశాలు, కాషాయ జెండాలు ధరించి జై శ్రీరామ్ అంటూ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు.

18న అశ్వత్థంలో బహిరంగ వేలం

పెద్దపప్పూరు: మాఘమాసం తిరునాల సందర్భంగా అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో టెంకాయల విక్రయం, తలనీలాలు, కొబ్బరిచిప్పలు పోగు చేసుకొను హక్కు కోసం ఈనెల 18న వేలం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం, చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.











వైభవంగా భోగి వేడుకలు

సాక్షి బృందం: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో ఆదివారం భోగి వేడుకలు వైభవంగా జరిగాయి. పలు ప్రాంతాల్లో యువకులు భోగి మంటలువేసి ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. మహిళలు తెల్లవారుజామునే స్నానాలు ఆచరించి ఇళ్ల ముందు కల్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు వేసి అందులో గొబ్బెమ్మలు ఉంచి పూజలు చేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. పలుచోట్ల ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.


పామిడిలో భోగి మంటలు వేస్తున్న ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, మాజీ చైర్మన్ వీరా



యాడకి: ముగ్గుల పోటీల బహుమతులను అందిస్తున్న జడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి


గుత్తిలో ఓ ఇంటి ముందు వేసిన ముగ్గు


గుత్తి : గొందిపల్లిలో భోగి మంట వేసిన చిన్నారులు


బుక్కరాయసముద్రంలో ముగ్గులను పరిశీలిస్తున్న సర్పంచ్ పార్వతి తదితరులు


తాడిపత్రిలో భోగి మంట వద్ద సందడి చేస్తున్న కాలనీ వాసులు


పుట్లూరులో చిన్నారికి భోగి పండ్లు పోస్తున్న తల్లితండ్రులు

సంక్రాంతి శుభాకాంక్షలు


కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి

తాడిపత్రి అర్బన్: మకర సంక్రాంతి సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మీయతలు, అనుబంధాలకు సంక్రాంతి పండగ ప్రతీక అని అన్నారు. భోగి మంటలు, రంగ వల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందళ్లు, పైరు పచ్చల కళకళలు సంక్రాంతి పేరు చెబితే అందరికీ గుర్తుకొస్తాయని తన ప్రకటనలో ఎమ్మెల్యే పేర్కొన్నారు. అన్నపూర్ణగా పేరు గాంచిన తెలుగు నేల మీద రైతన్నలు, గ్రామీణ వృత్తుల వారు సుఖ సంతోషాలతో తులతూగాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు.

గుంతకల్లుటౌన్: నియోజకవర్గం ప్రజలందరికీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాల్లో సరికొత్త కాంతిని నింపాలని, అన్ని వర్గాల ప్రజలు పాడి పంటలు, సిరి సంపదలు, సుఖసంతోషాలతో జీవించాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్లు ఆయన ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు.

శింగనమల: నియోజకవర్గంలోని ప్రజలకు భోగి భోగభాగ్యాలను, సంక్రాంతి సుఖ సంతోషాలను, కనుమ కమ్మని అనుభూతులను అందించాలని, అవి జీవితాంతం వెల్లివిరియాలని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వారు ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు.

ఆల్బమ్ సాంగ్ ఆవిష్కరణ

గుత్తి: పట్టణంలోని తన ఇంటిలో వైఎస్సార్ సీపీ డోన్ నియోజకవర్గ పరిశీలకుడు కోనా మురళీధర్‌రెడ్డి, ఈయన సతీమణి శ్రీలత రెడ్డి ఆదివారం కన్నా అంటూ కలిసినవే అనే ఆల్బమ్ సాంగ్‌ను ఆవిష్కరించారు. ఆల్బమ్‌లో శ్రావణి చౌదరి, అనిల్ లను అద్భుతంగా నటించారని కోనా ప్రశంసించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, శివ, హరి, ప్రవీణ్, రవి, రాజేష్, చరణ్, తేజ, సంతోష్, రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ సీసీఐ కాలనీ(22వ వార్డు)కి చెందిన చంద్రావతి శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేలు మృతురాలు భర్త శ్రీనివాసులుకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సులోచన, సచివాలయ కన్వీనర్ రంగస్వామి, సచివాలయ ఉద్యోగి గంగాధర్ ఉన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని వృద్ధులు, నిరాశ్రయులకు, యాచకులకు ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ సభ్యులు ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. రూ.10 వేల విలువ దుప్పట్లను సుమారు 45 మందికి దుప్పట్లు పంపిణీ చేసినట్లు సంస్థ అధ్యక్షుడు దోగూరు శ్రీహరి తెలిపారు. సంస్థ కన్వీనర్ చెన్నకేశవ శ్రీరంగయ్య, ఉపాధ్యక్షులు గుర్రప్ప, నాగభూషణం, శంకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భగీరథ మహర్షి అందరివాడు

గుంతకల్లుటౌన్: తన కఠోర తపస్సుతో దివి నుంచి భువికి గంగను రప్పించిన మహర్షి భగీరథుడు అందరివాడని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం కసాపురం రోడ్డులోని వైస్సార్ పార్క్ ముందు ఉప్పర(సగర) సంఘం ఆధ్వర్యంలో దాత నక్కాశ్రీనివాససాగర్ సహకారంతో ఏర్పాటు చేసిన భగీరథుడి విగ్రహాన్ని ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని ఆవిష్కరించారు. భగీరథుడి విగ్రహానికి పూలమాల వేసి నారికేళాన్ని సమర్పించారు. అనంతరం విగ్రహం చుట్టూ ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సగర కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయించిన ఘనత దివంగత మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డిదేనన్నారు. తన తండ్రి బాటలోనే సీఎం జగన్ కూడా సగర కులస్తులను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని వారు కోరారు. తదనంతరం సగర కులస్తుల కళ్యాణ మండపం నిర్మాణానికి 20 సెంట్ల స్థలం కేటాయించిన ఎమ్మెల్యే వైవీఆర్‌కు కులపెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విగ్రహదాత శ్రీనివాససాగర్, ఎస్‌ఐ శ్రీనివాసులు, ఉప్పర సంఘం గౌరవాధ్యక్షులు గంగన్న, లాయర్ నాగశేషు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, యు.రమేష్, ఉపాధ్యక్షుడు తిమ్మప్ప, కోశాధికారి ఎర్రిస్వామి, పార్టీ సీనియర్ నేత పెద్దపెద్దన్న, జెడ్పీటీసీ కదిరప్ప, కౌన్సిలర్ మెహరున్నీసా, పామిడి వైస్ ఎంపీపీ నక్కా సౌభాగ్య, యూత్ అధ్యక్షుడు వినోద్, కిమ్స్ రమేష్, సగర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


భగీరథుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, చైర్‌పర్సన్ భవాని

కమనీయం..గోదాదేవి కల్యాణం


గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి, విష్ణుమూర్తిల కల్యాణం కమనీయంగా సాగింది. ఆలయ అర్చకులు గోదాదేవి, విష్ణుమూర్తిని విశేషపుష్పాలతో అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గోదాదేవి కల్యాణం శాస్త్రోక్తంగా సాగింది. భక్తాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ఆలయ కమిటీ వారు విందును ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రంగయ్య, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కార్యదర్శి నారాయణస్వామి, సుదర్శన్ బాబు, సభ్యులు జయంతి వెంకట్, వీరాంజినేయులు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం


జై నాయుడుకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. జీ.కొట్టాల గ్రామానికి చెందిన జై నాయుడుకు రూ. 70 వేలు, పామిడికి చెందిన అక్బర్‌బాషాకు రూ.1.5 లక్షలు, అబ్బేదొడ్డికి చెందిన గోవిందమ్మకి రూ.60 వేలు, ఆమె భర్త సంజీవరెడ్డికి రూ.25 వేల చొప్పున చెక్కులు అందజేశారు. ఈసందర్భంగా వారు ఎమ్మెల్యే వైవీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గుత్తి రూరల్: అబ్బేదొడ్డిలో తొమ్మిది మంది పేకాటరాయుళ్లను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ నబీరసూల్ తెలిపిన వివరాలు.. గ్రామ శివారులో కంపచెట్లలో పెద్ద ఎత్తున పేకాట ఆడ తున్నారని పోలీసులకు సమాచారం అందింది. పక్కా సమాచారంతో ఎస్‌ఐ నబీరసూల్ సిబ్బందితో కలసి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.10.100 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

మద్యం పట్టివేత

పుట్లూరు: కడవకల్లు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న శ్రీనివాసులును అరెస్ట్ చేసి 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

గార్లదిన్నె: కల్లూరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రాజు అనే వ్యక్తిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

స్వీట్లు, పండ్లు పంపిణీ

యాడికి: ఇటీవల యాడికి సీఐగా బాధ్యతలు చేపట్టిన నాగార్జునరెడ్డి ఆదివారం నీలావతి వృద్ధాశ్రమంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు అందుతున్న సేవలపై ఆరా తీసి నిర్వాహకులు కృష్ణవేణి, విక్రమ్ దంపతులను అభినందించారు. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

















